క్లుప్తంగా

ఉప్పర్నాయుడువలసలో వెల్లివెరిసిన ఆధ్యాత్మికత



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలసలో పాగిరి, కరణం కుటుంబీకుల ఇలవేల్పులైన చిన్నప్పమ్మ, నారాయణమ్మ పేరంటాల గుడుల ప్రారంభోత్సవాలు గురువారం అంగరంగవైభవంగా నిర్వహించారు. సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు పాగిరి అప్పలనాయుడుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు జరగడంతో గ్రామంలో ఆధ్యాతిక వాతావరణం వెల్లివెరిసింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కరణం సూర్యారావు, కరణం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

రేగిడి: మండలంలో సరసనాపల్లి గ్రామానికి చెందిన కుప్పల నారాయణ అనే మహిళా రైతు పాముకాటుతో మృతి చెందింది. గురువారం ఉదయం పంట పొలంలో వరి పనలు ఆరబెడుతుండగా.. పాము కరవడంతో ఆమెను 108 వాహనంలో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

పక్కాగా 'జగనన్న గోరుముద్ద'



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు

రాజాం: జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓలు బి.ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని పొగిరి ఎంపీపీ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మొత్తం 153 మంది విద్యార్థులకు గాను 140 మంది హాజరైనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల హాజరుశాతం ఇంకా పెరగాలని హెచ్‌ఎం కె.జయకు సూచించారు. అనంతరం భోజనం రుచి చూసి రుచికరంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నారాయణరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో సీఆర్‌ఎంటీ, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. నాడు – నేడు పనులు, లిప్, తర్ల్, గ్రేడింగ్, పాఠశాలల అభివృద్ధి వంటి అంశాలపై నివేదికలు సకాలంలో అందించి కంప్యూటరీకరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మద్దువలసలో అన్నసమారాధన

వంగర: మండల పరిధి మద్దువలస గొర్లె శ్రీరాములనాయుడు ప్రాజెక్ట్ ఆవరణలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. రేగిడి మండలం సరసనాపల్లి గ్రామానికి చెందిన మీసాల అభిరామ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధిపథంలో నడపాలి

- ఎంపీడీఓ బాసూరి శంకరరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు

రాజాం: పంచాయతీలను అభివృద్ధిపథంలో నడపాలని.. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు ప్రధానపాత్ర పోషించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమీక్షించారు. నిధులు సమీకరించడం.. వాటిని సక్రమంగా ఖర్చు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, ఈఓపీఆర్‌డీఓ యాలాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజలకు మేలు



బొబ్బిలి: పాతబొబ్బిలిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసిన మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌నాయుడు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమంతో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గురువారం పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి, పార్టీని గెలిపించాలని కోరుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుండడం విశేషం. – సాక్షి నెట్‌వర్క్.



తెర్లాం: పూనువలసలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు



బొబ్బిలి: ఎం.బూర్జివలసలో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు తదితరులు



సంతకవిటి: మంతినలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రేగిడి: కొమెరలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు, తదితరులు



రామభద్రపురం: తారాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరస్వతి తదితరులు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని కోడూరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలనే తపనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, ఆ దిశగా ఆయన పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఓ వైపు ప్రతీ ప్రాంతం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నారని, మరోవైపు ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలులోని సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు దేశవ్యాప్తంగా మంచి పేరుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా అప్పటి టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతీ పని గ్రామంలోనే పారదర్శకంగా జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బినాయుని వెంకటనాయుడు, ఎంపీటీసీ మరిపి శ్రీదేవి, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, సర్పంచ్ భోగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పాలనపై ఓరియెంటేషన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో పాలనపై ఓరియెంటేషన్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. పంచాయతీల్లో ఆదాయం మెరుగు కోసం చేపట్టాల్సిన చర్యలు, వనరుల సమీకరణ, స్వపరిపాలనపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో పోతుల రవికుమార్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో మెలగాలని, తరచూ చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పాలన ఉండేలా జాగ్రత్త పడాలని తెలిపారు. మనమంతట మనమే ఆదాయ వనరులను సృష్టించుకోవాలని తద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీల అభివృద్ధి కొనసాగించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రుద్రాక్షలతో పూజలు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని దాడితల్లి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కాశీ నుంచి తెప్పించిన 1,108 రుద్రాక్షలతో పురోహితులు పిండిప్రోలు మణికుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు చేశారు. దేవుని అనుగ్రహం రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు.

నగర సంకీర్తన

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో అయ్యప్పస్వామి దీక్షాపరులు గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. అయ్యప్పస్వామి చిత్రపటంతో వీధుల్లో ఊరేగుతూ భజనలు చేసుకుంటూ స్వామిని ఆరాధిస్తూ పాటలు పాడారు.

900 టన్నుల ధాన్యం మిల్లులకు తరలింపు



మిల్లుకు ధాన్యం బస్తాలు తరలిస్తున్న దృశ్యం

తెర్లాం: తుపాను వర్షాల కారణంగా రైతులు నూర్పు చేసిన ధాన్యం తడవకుండా ఉండేలా మండలంలోని 900 టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించినట్లు మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వీఏఏలంతా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, పాడైన పంటలను పరిశీలించాలన్నారు.

వైభవంగా పైడితల్లి ఆలయ ప్రారంభోత్సవం



ఎమ్మెల్యే బడ్డుకొండను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గొర్లిపేటలోమ నూతనంగా నిర్మించిన పైడితల్లి ఆలయ ప్రారంభోత్సవం గురువారంతో వైభవంగా ముగిశాయి. మూడు రోజుల నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రుత్విక్కులు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు యంత్ర ప్రతిష్ఠ, శిఖర కళశ ప్రతిష్ఠ, అష్టదిగ్బంధనం, తదితర కార్యక్రమాలను చేట్టి గోపూజా మహోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు బలిహరణ, సర్వ దర్శనం, నీరాజన, మంత్రపుష్ప ఆశీర్వచనం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స సత్యనారాయణ, తదితరులు ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నడుపూరి గౌరి, ఎంపీటీసీ సభ్యురాలు మిరప శాంతికుమారి, నాయకులు పరిసినాయుడు, పిన్నింటి శ్రీను, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి: స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీన జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, కళాశాల కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 13 కంపెనీలు 1200 ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందని, పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి-ఫార్మసీ, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి విజయనగరం, విశాఖపట్నం, తుని, కడప, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్‌లో ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు.

అధికారుల పరిశీలన

బొబ్బిలి: మండలంలోని కారాడ, పిరిడి ప్రాంతాల్లోని రక్షిత మంచినీటి పథకాలతో పాటు వాటికి నీటిని తీసుకువెళ్లే మోటార్ పంపులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎంకే రెడ్డి, ఏఈ శ్రావణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మిచాంగ్ తుపాను వర్షాల కారణంగా ఎక్కడైనా ఏవైనా దెబ్బతిన్నాయా లేదా అనే విషయం గమనించామని, అంతా బాగానే ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు వంగర విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వంగర: జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దేవకివాడ అశోక్, కొమరావు చందు ఎంపికయ్యారు. గత నెల 24, 25 తేదీలలో పల్నాడు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ బి. కవిత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి



ఓటరు దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేస్తున్న బీఎల్‌వోలు

రామభద్రపురం: అర్హులైన యువతీయువకులంతా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎ.సులోచనరాణి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు సేకరించిన ఓటు దరఖాస్తులను గురువారం పరిశీలించిన ఆమె ఓటు నమోదు చేయించుకునేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా ఓటు నమోదుకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టామని ఆఫ్‌లైన్ ద్వారా 480 దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా 250 పైబడి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు మాత్రమే ఓటు నమోదుకు గడువు ఉన్నందున 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే పాత ఓటరు జాబితాలో పేర్లు, ఫొటోల్లో తప్పొప్పులుంటే వాటిని కూడా సవరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని దేవుపల్లికి చెందిన కర్రి లక్ష్మీప్రసన్నకు మంజూరైన రూ.3.6 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా గురువారం అందజేశారు. కొన్నాళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడిన ఆమెకు చికిత్స నిమిత్తం పెద్దమొత్తంలో డబ్బులు అవసరం కాగా ఆమె సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇటువంటి వారికి ఇప్పటివరకు 106 మందికి రూ.88,78,000 అందజేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వర్గాలు వెల్లడించాయి.

అంతర్ వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జీఎంఆర్ విద్యార్థులు



మౌనిష్



బాలయషిత

రాజాం సిటీ: ఈ నెల 12న రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విజయనగరం జేఎన్‌టీయూ జీవీ జట్టు తరఫున స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఇటీవల స్థానిక జీఎంఆర్ ఐటీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో కళాశాలకు చెందిన కె.మౌనిష్ (పురుషుల విభాగంలో), పి.బాలయషిత (మహిళల విభాగంలో) ఎంపికయ్యారన్నారు. వారి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ వ్యవహారాల డీన్ డాక్టర్ వి.రాంబాబు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

వరి పనలు ఆరబెట్టాలి..



రాజాం సిటీ: ఒమ్మి గ్రామంలో వరి దిబ్బలపై ఉప్పు ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న ఏఓ రేణుకాసాయి, తదితరులు



బాడంగి: కోడూరులో వరికుప్పపై ఉప్పుద్రావణం పిచికారీ చేయిస్తున్న ఏవో శిరీష

రేగిడి: మిచాంగ్ తుఫాన్ వర్షాలకు తడిచిన వరి పనలను ఆరబెట్టాలని ఏఓ జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని రేగిడి, ఉనుకూరు, వన్నలి, చాటాయివలస, గుళ్లపాడు, తదితర గ్రామాల్లోని పంటపొలాలను గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. తడిసిన వరి పైరుపు ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

రాజాం సిటీ: తుఫాన్ ప్రభావంతో తడిసిన వరి పైరును కాపాడుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని ఏఓ ఎం.రేణుకాసాయి సూచించారు. మండల పరిధి ఒమ్మిలో ఆమె పర్యటించి, వరి కుప్పలను పరిశీలించారు. బాగా తడిచిన ధాన్యం కుప్పలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. నూర్చుడి చేసిన ధాన్యం రెండు, మూడు రోజులు ఎండబెట్టాలని సూచించారు.

పంటనష్టం అంచనా వేయండి

బాడంగి: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులు నష్టపోకుండా పంట నష్టం అంచనా వేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోడూరులో గురువారం పర్యటించిన ఆయన ఏవో శిరీషతో మాట్లాడి, తుపాను కారణంగా జరిగిన పంట నష్టంపై ఆరాతీశారు. ఆఫ్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని తెలిపారు. పొలాల్లో కోసిన వరి పనలు, వేసిన వరికుప్పలు, నూర్చిన ధాన్యం పాడవ్వకుండా ఉండేందుకు రైతులకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- నలుగురికి గాయాలు



కుక్కదాడిలో గాయపడిన వెంకటమ్మ, దాలప్పడు, గౌరునాయుడు, దోల గౌరునాయుడు

రాజాం /సంతకవిటి: సంతకవిటి మండలంలోని మోదుగులపేటలో గురువారం ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి నలుగురిని గాయపరిచింది. గ్రామానికి చెందిన ముదిలి వెంకటమ్మ, కొమ్ము దాలప్పుడు ప్రధాన వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా వీరిపైకి దూసుకొచ్చిన పిచ్చికుక్క కాళ్లు, ఒంటిపై తీవ్రగాయాలు చేసింది. అనంతరం పంటపొలాల వైపు పారిపోయింది. కొంత సమయం అనంతరం మళ్లీ గ్రామంలోకి వచ్చి పాగిరి గౌరునాయుడు, దోల గౌరునాయుడులను తీవ్రంగా గాయపరిచింది. వెంటనే స్థానికులు ఈ పిచ్చికుక్కను వెంబండిచి చంపేశారు. బాధితులను 108 వాహనంతో పాటు ప్రైవేట్ వాహనంలో రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు.